సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 23 । ఆగస్టు । 2023



సీతమ్మసాగర్ పూర్తవుతుందా?

ఎన్జీటీ ఉత్తర్వులతో నిలిచిపోయిన సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పనులు మళ్లీ ప్రారంభమయ్యేనా అనే సందేహం నెలకొంది. 10లో



విద్యావ్యవస్థ నిర్వీర్యం

పాలకుల విధానాలతో విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతోందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆరోపించారు. 12లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం అక్కడక్కడా వర్షం పడొచ్చు. మరికొన్ని ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



లక్ష్మీనర్సింహస్వామి వారి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నర్సింహాలయంలో సుదర్శన హోమం..

రామాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహస్వామి వారి ఆలయంలో సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు చేశారు. రామాలయంలో ఈనెల 26 నుంచి 31 వరకు పవిత్రోత్సవాలు, 25న శ్రావణ శుక్ర వార వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించనున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

డీఎంహెచ్‌ఓ శిరీష



సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ శిరీష

బూర్గంపాడు: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ శిరీష సూచించారు. మండల పరిధిలోని కృష్ణసాగర్, లక్ష్మీపురం, ఇరవెండి, సోంపల్లి, బూర్గంపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న లెప్రసీ సర్వేను మంగళవారం ఆమె పరిశీలించారు. జ్వరపీడితుల వివరాలు, జ్వరాల తీవ్రత గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దోమల నివారణకు నీటి నిల్వ ప్రాంతాల్లో గంబూషియా చేపలు వదిలే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం మోరంపల్లిబంజర పీహెచ్‌సీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసాహితి, వైద్యసిబ్బంది జీతు, బి.రవి, సత్యవతి, సడాల దేవి, రమణమూర్తి పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో జిల్లా విద్యార్థికి ప్రథమ ర్యాంక్



మేకల అశోక్

టేకులపల్లి: పీజీ సెట్ తెలుగు విభాగంలో టేకులపల్లి మండలం పాతర్లగడ్డ గ్రామానికి చెందిన మేకల అశోక్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. మారుమూల ఏజెన్సీ గ్రామానికి చెందిన ఆదివాసీలు మేకల సంగయ్య – బొజ్జమ్మ దంపతుల కుమారుడు అశోక్ చిన్నప్పటి నుంచి చదువులో ముందుండేవాడు. బీఈడీ పూర్తి చేసి, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ పీజీ సెట్ రాశాడు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన అశోక్‌ను పలువురు అభినందించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌గా రవీంద్రబాబు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నో ఏళ్లుగా స్థానచలనం లేకుండా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలోని సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు ఎట్టకేలకు జరిగాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలువురు సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1 అడపా రవీంద్రబాబును జిల్లా అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న గంగవరపు నరేంద్రను ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. అలాగే, ఖమ్మం ఎంవీ అండ్ ఆడిట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.పద్మను ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1గా, ఖమ్మంరూరల్ సబ్‌రిజిస్ట్రార్ టి.సుజన్‌కుమార్‌ను ఎంవీ అండ్ ఆడిట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. అలాగే, మధిర సబ్ రిజిస్ట్రార్ ఎస్.రామకిషోర్‌రెడ్డిని నర్సంపేట సబ్‌రిజిస్ట్రార్‌గా, భద్రాచలం సబ్‌రిజిస్ట్రార్ ఏ.గిరిధర్‌ను మధిర సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. అయితే, భద్రాచలం సబ్ రిజిస్ట్రార్‌గా మాత్రం ఎవరినీ నియమించలేదు.

కాంగ్రెస్‌లో కోలాహలం

పెరుగుతున్న టికెట్ ఆశావహులు

- కొత్తగూడెం నుంచి పోటీకి తీవ్ర ప్రయత్నాలు
- పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టిన పొంగులేటి
- ప్రజా చైతన్యం పేరుతో ఎడవల్లి బలప్రదర్శన
- నేడు జిల్లాలో రేణుకాచౌదరి పర్యటన



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వచ్చే ఎన్నికల్లో టికెట్ దక్కించుకుని హస్తం గుర్తుపై పోటీ చేసి అసెంబ్లీలో అడుగు పెట్టేందుకు కాంగ్రెస్ నేతలు సమాయత్తం అవుతున్నారు. పార్టీ పెద్దలు ఎవరికి టికెట్ కేటాయిస్తారనే అంశంపై స్పష్టత లేకున్నా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలవడం, సభలు, సమావేశాల నిర్వహణలో బిజీ అవుతున్నారు. ఈ విషయంలో కొత్తగూడెం నియోజకవర్గ ఆశావహులు ముందు వరుసలో ఉన్నారు.

జనరల్ స్థానంలో పోటాపోటీ..

జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇందులో కొత్తగూడెం ఒక్కటే జనరల్‌గా ఉంది. ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలోకి దిగేందుకు నేతల మధ్య పోటీ నెలకొంది. జిల్లా వ్యాప్తంగా బలమైన అనుచరగణం కలిగిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం నుంచి హస్తం గుర్తుపై పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు కొత్తగూడెంలో క్యాంప్ కార్యాలయం కూడా ఏర్పాటు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా రాష్ట్ర వ్యాప్తంగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో శ్రీనివాసరెడ్డి పర్యటిస్తున్నారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ కొత్తగూడెంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. హంగూ ఆర్భాటం లేకుండా చాపకింద నీరులా ఇతర పార్టీలకు చెందిన కేడర్‌ను కాంగ్రెస్‌లో చేర్పిస్తున్నారు. పొంగులేటి నియోజకవర్గంలో అందుబాటులో లేనప్పుడు ఆయన అనుచర గణం తమ పని తాము చేసుకుపోతోంది. అయితే పొంగులేటి వచ్చే ఎన్నికల్లో కొత్తగూడెం, ఖమ్మంలో ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే అంశంపై ఇంకా స్పష్టత రాకపోవడం గమనార్హం.

అడపాదడపా పోట్ల పర్యటన..

టీడీపీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు.. బీఆర్‌ఎస్ మీదుగా కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క వర్గం నేతగా కొనసాగుతున్నారు. కొత్తగూడెం నుంచి పోటీ చేసేందుకు ఆయన ఆసక్తి చూపిస్తున్నారు. గతేడాది ఇక్కడ క్యాంప్ కార్యాలయం కూడా ఏర్పాటు చేశారు. ఇటీవల తన పుట్టిన రోజు సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, రాజకీయ ప్రత్యర్థులపై ఘాటైన విమర్శలు చేయడం తప్ప నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్లను ప్రభావితం చేసే స్థాయిలో పెద్దగా కార్యక్రమాలు చేపట్టలేదు. పార్టీ పిలుపు మేరకు అడపాదడపా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు.

ఎడవల్లి ఎడతెగని ప్రయత్నాలు..

కొత్తగూడెం నియోజకవర్గం నుంచి విజయం సాధించి ఎలాగైనా అసెంబ్లీలో అడుగు పెట్టాలని గత 15 ఏళ్లుగా ఎడవల్లి కృష్ణ ఎడతెగని ప్రయత్నాలు చేస్తున్నారు. గడిచిన మూడు ఎన్నికల్లో వివిధ గుర్తులపై ఆయన పోటీ చేసినా విజయం సాధించలేకపోయారు. ప్రస్తుతం ఆయన కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి అనుచరుడిగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. క్రమం తప్పకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈసారి ఎలాగైనా విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. నియోజకవర్గంలో అందరి కంటే ముందుగా టికెట్ కోసం గాంధీభవన్‌లో దరఖాస్తు సమర్పించారు.

మార్మోగుతున్న ఇల్లెందు పేరు..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో ఇల్లెందు పేరు మార్మోగుతోంది. మంగళవారం సాయంత్రం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 115 నియోజకవర్గాలకు సంబంధించి 306 దరఖాస్తులు రాగా, ఇందులో రికార్డు స్థాయిలో ఇల్లెందు స్థానం నుంచి ఏకంగా 40 మంది టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో గాంధీభవన్‌లో ఇల్లెందు హాట్ టాపిక్‌గా మారింది. కాగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు గాంధీభవన్‌లో దరఖాస్తు సమర్పించే అవకాశం ఉంది. ఖమ్మం, కొత్తగూడెంతో పాటు పాలేరుకు కూడా ఆయన దరఖాస్తు సమర్పిస్తారని సమాచారం. పొంగులేటితో పాటు ఆయన అనుచరులు సైతం రేపు గాంధీభవన్‌లో తమ నియోజకవర్గాలకు సంబంధించి దరఖాస్తు చేసే అవకాశం ఉంది. దరఖాస్తులు సమర్పించేందుకు ఈనెల 25 వరకు అవకాశం ఉంది.

బల ప్రదర్శనకు సిద్ధం..

టికెట్ కోసం పోటీ నెలకొన్న వేళ.. బలప్రదర్శనకు ఎడవల్లి కృష్ణ సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బుధవారం కొత్తగూడెంలో ప్రజా చైతన్యం పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరితో పాటు ఏఐసీసీ కీలక నేతలు హాజరవుతున్నారు. రేణుకాచౌదరి గత కొంతకాలంగా జిల్లా రాజకీయాలతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ పరంగా ఆమె కార్యక్రమాలన్నీ ఢిల్లీ, హైదరాబాద్, ఖమ్మం వరకే పరిమితం అవుతున్నాయి. అయితే టికెట్ల కేటాయింపు అంశం ముదురుపాకాన పడిన సమయాన రేణుకాచౌదరి జిల్లాకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. బుధ, గురువారాల్లో కొత్తగూడెం, పినపాక నియోజకవర్గాల్లో ఆమె పర్యటన ఖరారైంది. అయితే ప్రధాన కార్యక్రమాలన్నీ కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోనే ఉండడం విశేషం.

పారిశ్రామిక ప్రగతిని ప్రోత్సహించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. తద్వారా పారిశ్రామిక ప్రగతి సాధించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఐడీఓసీలో మంగళవారం జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ(డీఐపీఎస్) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని పారిశ్రామిక ప్రగతి, టీఎస్‌ఐపాస్ అమలు విధానం, టీఐడీఈఏ, టీపీఆర్‌ఐడీఈ పథకాల ద్వారా మంజూరు చేస్తున్న రాయితీలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ ఐపాస్ ద్వారా అనుమతులకు దరఖాస్తు చేసుకున్న నాలుగు పరిశ్రమలు, 10 రకాల అనుమతులకు సంబంధించిన దరఖాస్తులను, టీపీఆర్‌ఐడీఈ పథకం ద్వారా 25 రవాణా వాహనాలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తుదారుల్లో అర్హులైన వారిని గుర్తించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి టి. సీతారాం, టీఎస్ ఐఐసీ పవన్‌కుమార్, డీటీసీపీఓ సత్యనారాయణ, ఎల్‌డీఎం రామిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు, భూగర్భజల శాఖాధికారి బాలు, సురేష్‌బాబు, విద్యుత్ టెక్నికల్ ఏడీ వెంకటరత్నం, టీఎస్ పీసీబీ అధికారి రవీందర్, డీపీఓ రమాకాంత్, సీటీఓ మేరీ తదితరులు పాల్గొన్నారు.

మోడీ పాలనే శ్రీరామరక్ష



ఇల్లెందు : సమావేశంలో పాల్గొన్న సమీర్, నాయకులు

మహారాష్ట్ర విధాన సభ డిప్యూటీ స్పీకర్ సమీర్‌కునవార్

ఇల్లెందు: సుస్థిర పాలన అందించే సామర్థ్యం బీజేపీకే ఉందని.. ప్రధాని నరేంద్రమోడీ పాలనే దేశానికి శ్రీరామరక్షగా నిలుస్తోందని మహారాష్ట్ర విధాన సభ డిప్యూటీ స్పీకర్ సమీర్ కునవార్ తెలిపారు. ప్రభాస్ యోజనా కార్యక్రమంలో భాగంగా ఇల్లెందులోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలుపు దిశగా ప్రతీ కార్యకర్త శ్రమించాలని సూచించారు. కాగా, కుటుంబ పాలన సాగిస్తున్న కేసీఆర్.. హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.సంజీవరెడ్డి, నాయకులు బలగాని గోపీకృష్ణ, మహేశ్వర్, మాధవ్, రామయ్య, సురేందర్, శివకుమార్, రేవళ్ల నాగరాజు, సుచిత్ర పాసీ, రాహుల్, నాళ్ల సోమసుందర్, రాంచందర్ నాయక్, ఊకె అబ్బయ్య పాల్గొన్నారు.



అశ్వాపురంలో మాట్లాడుతున్న ముకేశ్ మహాలింగ్

వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

అశ్వాపురం: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పి నరేంద్రమోడీ నాయకత్వంలో నీతివంతమైన పరిపాలన అందించే బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఒడిశా శాసనసభ్యుడు డాక్టర్ ముకేశ్ మహాలింగ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు శ్రమించాలన్నారు. బీజేపీ నాయకులు ముస్కు శ్రీనివాసరెడ్డి, తాటిపాముల అయిలయ్య, పున్నం భిక్షపతి, కొండి ప్రభాకర్‌రావు, సురకంటి లింగారెడ్డి, కోలా భాస్కర్, సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, కొల్లు లింగారెడ్డి, కృష్ణకుమారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టూరిస్టులొస్తారు.. జాగ్రత్త



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస రెడ్డి



మార్నింగ్ వాకర్స్‌తో పొంగులేటి

- రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం
- టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి

జూలూరుపాడు: 'ఎన్నికలొస్తున్నాయ్.. టూరిస్టులొస్తారు జాగ్రత్త' అని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జూలూరుపాడులో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పదవి ఉన్నా, లేకున్నా నిత్యం ప్రజలతోనే తాను మమేకమై ఉన్నానని, వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకున్నానని తెలిపారు. అధికారంలో ఉన్న నాయకులెవ్వరూ ఇంతవరకు ప్రజలు ఎలా ఉన్నారు.. వారి సాధక బాధకాలు ఏంటని తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ ప్రజలను ప్రసన్నం చేసుకోవాలని వస్తారని, ఎవరు మనవాళ్లో ..ఎవరు పరాయివాళ్లో ప్రజలు గుర్తించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌ను దీవించడానికి సిద్ధంగా ఉన్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రూ. 500కు వంటగ్యాస్, ఏడాదిలోనే రెండు లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, గిరిజనులకు పోడు భూమి పట్టాలు, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, రూ. 4 వేల పింఛన్ సౌకర్యం తదితర హామీలను అమలు చేయనున్నట్లు వివరించారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ జిమ్మిక్కులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ సందర్భంగా బేతాళపాడుకు చెందిన 15 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా, శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ విజయ బాయి, మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, వెంగన్నపాలెం ఎంపీటీసీ మధుసూదన్‌రావు, నాయకులు ముత్తినేని రామయ్య, బానోత్ లాలు నాయక్, దుద్దుకూరి సుమంత్, ధరావత్ రాంబాబు, పాలెపు భద్రయ్య, లేళ్ల గోపాల్‌రెడ్డి, నర్వనేని పుల్లారావు, కళ్యాణపు నరేష్, చిట్టిబాబు, పోతురాజు నాగరాజు, భూక్యా అమృ, మద్దిశెట్టి వంశీ, పి నరసింహారావు, వందనపు సత్యనారాయణ, అల్లాడి లింగారావు, హరి, భూపతిరావు, ఆంగోతు శ్రీను పాల్గొన్నారు.

మార్నింగ్ వాకర్స్‌తో మాటామంతి..

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌తో పాటు క్రీడాకారులతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ముచ్చటించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. రాబోయే రోజులలో కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, నాయకులు ఉకంటి గోపాల్‌రావు, తూముచౌదరి, ఆళ్ల మురళి, నాగేంద్రత్రివేది, ఆకునూరి కనుకరాజు పాల్గొన్నారు.

చేపలు సరే.. రొయ్యల జాడేది ?

- జిల్లాలో గతేడాది 10 చెరువుల్లో పెంపకం
- ఈ సంవత్సరం 14 చెరువుల్లో పిల్లలు పోయాలని నిర్ణయం
- ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మత్స్యకారులు



మంచినీటి రొయ్యలు

పాల్వంచరూరల్ : మత్స్యసంపద పెంపుతో పాటు మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆయా సొసైటీలకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. అయితే చేపల కంటే రొయ్యల పెంపకంతో అత్యధిక లాభాలు గడించవచ్చనే ఉద్దేశంతో ఆ పిల్లలను కూడా పెంచాలని నిర్ణయించింది. రొయ్యలకు ధర, డిమాండ్ ఎక్కువగా ఉండడంతో గణనీయమైన ఆదాయం వస్తుందని మత్స్యకారులు కూడా ఆనందపడ్డారు. అయితే ఈనెల 26 నుంచి చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తుండగా.. రొయ్య పిల్లల జాడే లేకపోవడంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

మత్స్యసిరి పెంచేలా..

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధితో పాటు మత్స్య సంపదను పెంచేందుకు 2016 – 17 ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం చెరువుల్లో చేప పిల్లలను పెంచుతోంది. వంద శాతం సబ్సిడీపై రెండు రకాల చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. చేపలను పట్టడం, విక్రయించడం, రవాణాకు అవసరమైన పరికరాలు, ద్విచక్ర వాహనాలు కూడా మత్స్యకారులకు సబ్సిడీపై అందిస్తోంది. జిల్లాలో 734 చెరువులు, 3 జలాశయాల్లో ఈ ఏడాది 1.77 కోట్ల చేప పిల్లలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్న మత్స్యశాఖ.. ఇందుకు అనుగుణంగా చేప పిల్లల పంపిణీకి ఈనెల 26న శ్రీకారం చుట్టనుంది.

మంచినీటి చెరువుల్లో రొయ్యలు..

జిల్లాలోని 14 మంచినీటి చెరువుల్లో ఈ సంవత్సరం రొయ్యలు కూడా పెంచాలని మత్స్యశాఖ అధికారులు నిర్ణయించారు. గతేడాది సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువులో 1.38 లక్షలు, బూర్గంపాడు మండలం నకిరేపేట చెరువులో 38 వేల రొయ్యల ఉత్పత్తి కోసం మత్స్య పారిశ్రామిక సొసైటీలకు రూ.6 లక్షలు మంజూరు చేశారు. గతేడాది రొయ్యల ఉత్పత్తి ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది వాటి ఉత్పత్తిని మరింతగా పెంచాలని నిర్ణయించారు. బూర్గంపాడు, అశ్వాపురం, అశ్వారావుపేట, ఇల్లెందు, టేకులపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్, చండ్రుగొండ, చర్ల, మణుగూరు మండలాల్లో వీటిని ఉత్పత్తి చెయ్యాలని భావించారు. అయితే ఈ'సంవత్సరం రొయ్యల ఉత్పత్తిపై మత్స్య శాఖ నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో ఇటు మత్స్య పారిశ్రామిక సొసైటీ సభ్యులు, అటు అధికారులు ఎదురుచూస్తున్నారు. రొయ్య ల పంపిణీలో ఇంకా జాప్యం జరిగితే ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు.

ఐదు నెలల్లో దిగుబడి..

రొయ్యల్లో రెండు రకాలు ఉంటాయి. ఇందులో ఉప్పునీటిలో పెరిగే రొయ్యలు (టైగర్ రొయ్యలు), మంచినీటిలో పెరిగే రొయ్యలు ఉన్నాయి. జిల్లా వాతావరణ పరిస్థి తులకు మంచినీటి రొయ్యలే అనుకూలంగా ఉండడంతో ఆ రకాలనే పెంచాలని అధికారులు నిర్ణయించారు. రొయ్య పిల్లలు చెరువుల్లో పోసిన ఐదు నెలలకు సరైన దిగుబడి వస్తుంది. ఈ రొయ్యలను మత్స్య సొసైటీ సభ్యులు విక్రయించుకుని లబ్ధి పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ రూ.300 ఉండగా, డిమాండ్ కూడా ఎక్కువగానే ఉంటుంది.

14 చెరువులకు పంపిణీ చేస్తాం



జిల్లాలో రొయ్యల ఉత్పత్తి పెంపునకు 14 చెరువుల్లో 20, 84, 250 రొయ్య పిల్ల లను పంపిణీ చేయాలని ప్రతిపాదనలు పంపించాం. అన్నపురెడ్డిపల్లి మండలం ఆనందవనం ప్రాజెక్టు, అశ్వాపురంలోని తుమ్మల చెరువు, అశ్వారావుపేటలో పెద్దవాగు ప్రాజెక్టు, అంకమ్మచెరువు, బూర్గంపాడు మండలం దోమలవాగు ప్రాజెక్టు, చండ్రుగొండలోని వెంగళరావుసాగర్ ప్రాజెక్టు, చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు, జూలూరుపాడులో ఎర్రవాగు ప్రాజెక్టు, మణుగూరులో పెద్దచెరువు, పేరంటాల చెరువు, సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువు, టేకులపల్లిలోని వరకలవాగు, ఇల్లెందు మండలం రాఘబోయినగూడెం, సుదిమళ్ల చెరువుల్లో రొయ్యలు పెంచాలని నిర్ణయించాం. అయితే దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– వీరన్న, జిల్లా మత్స్యశాఖాధికారి

భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

అన్నపురెడ్డిపల్లి: నూతనంగా మంజూరైన పంచాయతీ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ విద్యాలత అధికారులను ఆదేశించారు. మండలంలో నూతనంగా నిర్మిస్తున్న తొట్టిపంపు, నర్సాపురం పంచాయతీ భవనాలను మంగళవారం ఆమె పరిశీలించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎంపీడీఓ అన్నపూర్ణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో గృహలక్ష్మి దరఖాస్తుల ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అన్నపూర్ణ విద్యాలతకు మొక్క అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలి



సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, బాధ్యతగా ఓటు వేయాలని, వందశాతం పోలింగ్‌కు అందరూ సహకరించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన స్వీప్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులకు అవగాహన కల్పించారు. ఓటరు చైతన్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని, 5కే రన్ ద్వారా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించామన్నారు. స్వీప్ కన్వీనర్ మధుసూదన్‌రాజు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ, పౌరుల బాధ్యతలు, ఓటు విలువ గురించి వివరించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సబిత, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటర్ల జాబితాలో మార్పులకు అవకాశం

● ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్


మాట్లాడుతున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం: ముసాయిదా ఓటర్ల జాబితాను తహసీల్దార్, సహాయ ఓటర్ల నమోదు అధికారి కార్యాలయం, ఐటీడీఏ కార్యాలయంలో ప్రదర్శించామని పినపాక నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలోని వివిధ పార్టీల నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఓటర్ల జాబితాలో సవరణలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో, సంబంధిత సహాయ ఓటర్ల నమోదు అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని చెప్పారు. ఈమేరకు ఫారాలు ఫారాలు మీసేవ సెంటర్లు, స్థానిక ఏఈఆర్ఓ కార్యాలయం, బీఎల్ఓల వద్ద అందుబాటులో ఉంటాయని పీఓ వివరించారు.

నీటి సరఫరాలో అవాంతరాలు రావొద్దు

పాల్వంచ రూరల్: గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా చేయాలని, ఈ విషయంలో ఎలాంటి అవాంతరావు రావొద్దని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ వి.శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని తోగ్గూడెం నీటిశుద్ధి కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీఆర్ఏలు మిషన్ భగీరథ ఏఈలకు సహాయకులుగా విధులు నిర్వహించాలని అన్నారు. తాగునీటి సరఫరాలో లోటుపాట్లు లేకుండా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఎక్కడ పైపులైన్ పగిలినా, లీకైనా సంబంధిత ఏఈలు, గ్రామ సర్పంచ్‌లకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించేలా చూడాలని సూచించారు. ప్రతీ నెల వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని చెప్పారు. సమావేశంలో ఎస్‌ఈ సదాశివకుమార్, ఇంట్రావిలేజ్ ఈఈ తిరుమలేష్, గ్రిడ్ ఈఈ నళిని, డీఈ సాయికుమార్, ఏఈ నీలావతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పార్లమెంట్ కన్వీనర్‌గా 'నంబూరి'

ఖమ్మంమామిళ్లగూడెం: బీజేపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా నంబూరి రామలింగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనతోపాటు జాయింట్ కన్వీనర్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పి.నిరంజన్‌రెడ్డిని నియమించారు.

ప్రతీ రైతుకు ఉచితంగా న్యాయ సేవలు

ఇల్లెందురూరల్: ప్రతి రైతుకు ఉచితంగా న్యాయ సహాయం అందించడమే లక్ష్యంగా రైతు వేదికల్లో లీగల్ సర్వీసెస్ విభాగాన్ని ఏర్పాటు చేశామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అభిమన్యుడు అన్నారు. మండలంలోని సుదిమళ్ల రైతు వేదికలో లీగల్ సర్వీసెస్ విభాగం పనితీరును మంగళవారం పరిశీలించారు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న న్యాయ కేంద్రానికి ఎంతమంది రైతులు హాజరవుతున్నారు? వారికి చెబుతున్న అంశాలేమిటనే తదితర అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం పంట పొలాల్లో ఏదో ఒక పని చేసుకుంటూ జీవనం సాగించే రైతులు న్యాయ సంబంధిత అంశాలను సద్వినియోగం చేసుకోలేక నష్టపోతున్నారని చెప్పారు. రైతులు న్యాయం పొందేలా లీగల్ సర్వీసెస్ విభాగం సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ సతీశ్‌ఖండేల్‌వాల్, టెక్నికల్ ఏఓ సాయి నారాయణ, ఏఈఓ శ్రుతి పాల్గొన్నారు.

నలుగురిపై కేసు

పాల్వంచరూరల్: తన కుమారుడిపై దాడి చేసి నగదు, బంగారు ఉంగరాన్ని దోచుకున్నారని ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఇందిరానగర్‌కాలనీకి చెందిన విజయ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి హైదరాబాద్ బయలుదేరిన విజయ్‌ను అనిల్, బోరువెల్ సాయి, పండు, బి.రవి అడ్డగించి, దాడి చేసి రూ.26 వేల నగదు, బంగారు ఉంగరం లాక్కున్నారని మంగళవారం విజయ్ తండ్రి భూక్యా సీతారాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: వివాహితపై లైంగికదాడికి యత్నించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కార్తీక్ కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి పంచాయతీ అంబేడ్కర్ కాలనీ వద్ద ఓ మహిళ కిరాణం దుకాణం నిర్వహిస్తోంది. ఈ నెల 10వ తేదీన ఇందిరానగర్ కాలనీకి చెందిన భూక్యా విజయ్ వస్తువు దుకాణానికి వెళ్లి సదరు వివాహితపై లైంగికదాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయగా చుట్టుపక్కలవారు రావడంతో విజయ్ పరారయ్యాడు. బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

సీతమ్మసాగర్ పూర్తవుతుందా?


సీతమ్మసాగర్ బ్యారేజీని సందర్శించిన ఎన్‌జీటీ నియమిత ద్విసభ్య కమిటీ సభ్యులు (ఫైల్)

● జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కొనసాగుతున్న విచారణ
● పర్యావరణ అనుమతులు పొందేందుకు జలవనరుల శాఖ అధికారుల కసరత్తు

అశ్వాపురం: ఎన్జీటీ ఉత్తర్వుల మేరకు మూడు నెలలుగా నిలిచిపోయిన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు పనులు పునఃప్రారంభమవుతాయా? అనే సందేహం సర్వత్రా నెలకొంది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 280 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టును చేపట్టింది. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం గ్రామంలో గోదావరి నదిపై దుమ్ముగూడెం ఆనకట్టకు దిగువన సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మిస్తున్నారు. దీని ద్వారా 37.5 టీఎంసీల నీరు నిల్వ చేయనున్నారు. ఆరు బ్లాకులుగా బ్యారేజీని నిర్మిస్తున్నారు. ఫియర్ల నిర్మాణం కొనసాగుతున్న సమయంలో పర్యావరణ అనుమతులు లేకుండా సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులు చేపడుతున్నారని దుమ్ముగూడెం మండలానికి చెందిన నిర్వాసితుడు తెల్లం నరేశ్ చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ను ఆశ్రయించాడు. పర్యావరణ అనుమతులు లేకుండా పనులు చేపట్టవద్దని సూచిస్తూ మార్చి 23న ఎన్‌జీటీ పనులు నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మూడు నెలలుగా పనులు నిలిచిపోయాయి.

కొనసాగుతున్న విచారణ..

సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులపై ఎన్‌జీటీలో ఐదునెలలుగా విచారణ కొనసాగుతోంది. ఎన్‌జీటీ ఉత్తర్వులకు విరుద్ధంగా పనులు కొనసాగిస్తున్నారని పిటిషనర్ తెల్లం నరేశ్ జూలై 12న జరిగిన విచారణలో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యంతర ఉత్తర్వులకు విరుద్ధంగా సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులు కొనసాగిస్తున్నట్టు కనిపిస్తోందని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జూన్ 28న క్షేత్రస్థాయిలో పర్యటించిన కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, గోదావరి నది నిర్వహణ బోర్డులతో కూడిన సంయుక్త కమిటీ నివేదిక అదే విషయాన్ని స్పష్టం చేస్తోందని ఎన్‌జీటీ మండిపడింది. సంయుక్త కమిటీ నివేదిక పారదర్శకంగా లేదని ఎన్‌జీటీ స్పష్టం చేసింది. మార్చి 24 నుంచి జూన్ 28 వరకు అక్కడ ఉన్న యంత్రాలు, షట్టర్లు తొలగిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అక్కడ పనులకు సంబంధించిన రిజిష్టర్లు పెట్టలేదని, రికార్డులు లేకుండా పనులు చేస్తున్నట్టు కనిపిస్తోందని, షట్టర్ల తొలగింపు వంటి పనులు చేపట్టాలన్నా ట్రిబ్యునల్ అనుమతి అవసరమని, అనుమతి లేకుండా పనులు కొనసాగించడం ఉత్తర్వుల ఉల్లంఘనేనని ఎన్‌జీటీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసింది. ఉల్లంఘనపై పర్యావరణ మంత్రిత్వ శాఖ, జీఆర్ఎంబీలు ఏం చర్యలు తీసుకున్నాయన్న విషయంపై నివేదిక ఇచ్చేవరకు వేచి చూస్తామని, తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నిర్మాణాలు కొనసాగించొద్దన్న మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని విచారణ ఆగస్టు 17కు వాయిదా వేసింది. ఆగస్టు 17న తిరిగి విచారించిన ఎన్‌జీటీ కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నివేదిక కోసం వేచి చూస్తామని నివేదిక సమర్పించాక తదుపరి నిర్ణయం తీసుకుంటామని విచారణను సెప్టెంబర్ 15కు వాయిదా వేశారు. నిర్మాణాలు కొనసాగించొద్దన్న మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని స్పష్టం చేసింది.

జలవనరులశాఖ కసరత్తు..

పర్యావరణ అనుమతులు లేవని ఎన్‌జీటీ ఉత్తర్వులు వెలువరించడంతో సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయి. సీతారామ ఎత్తిపోతల పథకం పనులకు పర్యావరణ అనుమతులున్నాయని దీని విస్తరణలో భాగంగా సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులను చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పర్యావరణ శాఖకు తెలిపింది. ఎన్‌జీటీ విచారణలోను రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది ఇదే వాదనను వినిపించారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ రెండు వేర్వేరని, సీతమ్మసాగర్ ప్రాజెక్ట్‌కు విడిగా పర్యావరణ అనుమతులు పొందాలని గోదావరి బోర్డు, ఎన్‌జీటీ సూచనలతో పర్యావరణ అనుమతులు పొందేందుకు ప్రభుత్వం, జలవనరుల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూన్ 14న సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్‌పై అశ్వాపురంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అశ్వాపురం, మణుగూరు, చర్ల, దుమ్ముగూడెం మండలాల రైతులు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనాలున్నాయని, ప్రాజెక్ట్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని రైతులు, ప్రజలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. బ్యారేజీకి సమీపంలో ఉన్న మణుగూరు భారజల కర్మాగారానికి బ్యారేజీ నిర్మాణం వల్ల ఎలాంటి నష్టం లేదని ఎన్‌టీసీ ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రక్రియ తుది దశకు చేరకున్నట్టు సమాచారం. అనంతరం జలవనరుల శాఖ అధికారులు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై పర్యావరణ అనుమతులపై చర్చించి సమగ్రంగా వివరించనున్నారు. రెండు నెలల్లో పర్యావరణ అనుమతులు పొంది పనులు పునఃప్రారంభిస్తామని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

వ్యాపారిని బెదిరించి దోపిడీ

● రూ.30లక్షల విలువైన నగదు, అభరణాలు అపహరణ
● పోలీసులను చెబుతూ కత్తులతో హల్‌చల్


బీరువాను చూపిస్తున్న రుక్కయ్య భార్య రాధ

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురానికి చెందిన పురుగు మందుల వ్యాపారి చెరుకుమల్ల రుక్కయ్యను బెదిరించి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు రూ.15 లక్షల నగదుతోపాటు రూ.15 లక్షల విలువైన బంగారు అభరణాలను అపహరించిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు రుక్కయ్య దంపతులు, ప్రత్యక్ష సాక్షి బాదావత్ వెంకట్రామ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వ్యాపారి ఇంటికి నల్లటి కారులో నలుగురు రాగా, ఇద్దరు ముఖానికి ముసుగు వేసుకున్నారు. మరో ఇద్దరు మామూలాగానే ఉన్నారు. ఇద్దరు దుండగులు బయట గేటు వద్ద కాపలా ఉండి, మాస్కులు ధరించిన మరో ఇద్దరు ఇంటి తలుపు కొట్టారు. దీంతో కిటికీలో నుంచి రుక్కయ్య భార్య రాధ ఆరా తీయగా పోలీసులమని చెప్పారు. అయితే, రుక్కయ్య భోజనం చేస్తున్నారని చెబుతుండగానే ఆయన వచ్చి తలుపు తీయడంతో ఇద్దరు దుండగులు లోనకు ప్రవేశించి తలుపులు మూసేశారు. ఆ తర్వాత నకిలీ పురుగు మందులు అమ్ముతున్నావా అంటూ కత్తులతో దుండగులు బెదిరించి ఓ గదిలో నిర్బంధించారు. అనంతరం రాధను బెదిరిస్తూ బీరువా తాళాలు తీయించి రూ.15 లక్షల నగదు, సుమారు రూ.15 లక్షల విలువ చేసే బంగారు అభరణాలు తీసుకున్నారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని వచ్చిన కారును వెనక్కి తిప్పుకొని జూలూరుపాడు వైపు పారిపోయారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ పురుషోత్తం చేరుకుని దర్యాప్తు చేపట్టగా, క్లూస్ టీమ్ బృందాన్ని రపిప్పస్తున్నారు.

భూసేకరణ సర్వేను అడ్డుకున్న రైతులు


అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు, నాయకులు

టేకులపల్లి: వలిగొండ నుంచి మహబూబాబాద్, ఇల్లెందు మీదుగా కొత్తగూడెం(ఇల్లెందు క్రాస్ రోడ్డు) వరకు 930పీ హైవే నిర్మాణంపై టేకులపల్లి మండలంలోని తొమ్మిదోమైలుతండా నుంచి బొమ్మనపల్లి వరకు వ్యాపారులు, ఇళ్ల యజమానులు, రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఇంతలోనే టేకులపల్లి మండలం సులానగర్ నుంచి సీతారాంపురం స్టేజీ మధ్యలో టోల్‌గేట్ నిర్మాణం భూసేకరణ సర్వేకు మంగళవారం సర్వేయర్, రెవెన్యూ, ఎన్‌హెచ్ సిబ్బంది వచ్చారు. టోల్‌గేట్ కోసం సుమారు 16 ఎకరాల భూమి అవసరం పడుతుండటంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూములు కోల్పోవాల్సి వస్తోంది. దీంతో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లో టోల్‌గేట్ నిర్మాణం ఏమిటని ప్రశ్నిస్తూ రైతులు అడ్డుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న తహసీల్దార్ కొండపల్లి కృష్ణవేణి చేరుకున్నారు. టోల్‌గేట్ వల్ల తమ జీవనాధారమైన భూములను కోల్పోవాల్సి వస్తోందని, టోల్ గేట్‌ని వేరేచోటుకి మార్చాలని రైతులు రాసమల్ల నర్సయ్య, వెంకటేశ్, రాందాస్, బాణోతు లక్ష్మి, శివలాల్, రాకేశ్, ఉపేంద్ర, రాంకోటయ్య, ముత్తయ్య, పాపారావు, కమల తదితరులు విన్నవించారు. నేషనల్ హైవే, టోల్‌గేట్ ఎప్పుడో మంజూరైనందున సర్వే చేశాక అభ్యంతరాలుంటే తెలపాలని తహసీల్దార్ సూచించారు. అయినా రైతులు ససేమిరా అనడంతో పాటు గడువు ఇవ్వాలని కోరారు. రైతులకు మద్దతుగా లక్కినేని సురేందర్‌రావు, ఉండేటి ప్రసాద్, అజ్మీర శివ అధికారులతో మాట్లాడారు. దీంతో రెండు రోజులు గడువు ఇచ్చిన ఉద్యోగులు వెళ్లిపోయారు. సర్వేలో ఆర్ఐ రత్తయ్య, సర్వేయర్ కార్తీక్, ఎన్‌హెచ్ సిబ్బంది కార్తీక్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఫీజులకు చేయూత


విద్యార్థులు, ఉపాధ్యాయులతో అలుమినీ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు జరుపుకుని చదువుకున్న నాటి సంగతులను గుర్తు చేసుకోవడం తెలిసిందే. కానీ, తాము చదువుకున్న పాఠశాలల్లోని పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల 1985 బ్యాచ్ విద్యార్థులు అలుమినీ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. 2010వ సంవత్సరం నుంచి ఏటా కొందరు విద్యార్థులకు ఫీజు చెల్లిస్తున్నారు. అందులో భాగంగా 20 మంది ఫీజు కోసం రూ.80,776ను మంగళవారం పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్‌రావుకు అందజేశారు. అలుమినీ అసోసియేషన్ సభ్యులు ముళ్లపూడి రఘురామ్, ఈ.భాస్కర్, షారూఖ్‌తో పాటు ఉపాధ్యాయినులు సాయిసుజాత, ఎ.అరుణ, లావణ్య పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్ని సస్పెన్షన్

హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసిన 'కోనేరు'


సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతున్న చిన్ని

చుంచుపల్లి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని)ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీలో కొనసాగుతూనే రాజకీయ లబ్ధి కోసం సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ నాయకులను కలిసి ఆ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్న విషయాన్ని గమనించి బీజేపీ ఆయనపై వేటు వేసినట్లు చెబుతున్నారు. మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు కుమారుడైన చిన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా కొన్నేళ్లు పనిచేసి 2014లో అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలబడ్డారు. అనంతరం 2019లో బీజేపీలో చేరిన ఆయన జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే, సోమవారం ఎమ్మెల్సీ తాత మధుతో హైదరాబాద్ ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవితను కలిశారు. దీంతో ఆయన పార్టీ మారుతున్నారని గుర్తించి బీజేపీ నేతలు సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం చిన్ని కొత్తగూడెంలో మాట్లాడుతూ.. బీజేపీ అధ్యక్ష పదవితో పాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సీఎం కేసీఆర్ దార్శనికత నచ్చి త్వరలో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.

పార్టీకి ఎలాంటి నష్టం లేదు

లీడర్లు, కార్యకర్తలు వెంట లేని కోనేరు సత్యనారాయణ వంటి వ్యక్తులు బీజేపీని వీడితే పార్టీకి నష్టమేమి లేదని ఆ పార్టీ జిల్లా నాయకులు తెలిపారు. బీజేపీ కార్యాలయంలో మంగళవారం గోవా ఎమ్మెల్యే సంకల్ప అమోంకర్‌తో కలిసి నాయకులు మాట్లాడారు. పార్టీలో ఉన్నత పదవులను అనుభవిస్తూ వెళ్లిన వారు ద్రోహులుగా నిలిచిపోతారని విమర్శించారు. ఆయన వెంట అనుచరులు లేకున్నా అధ్యక్ష పదవి ఇచ్చిందని.. ఇప్పుడు ఆయన వెళ్లడం వల్ల నష్టమేమీ జరగదన్నారు. సమావేశంలో నాయకులు కేవీ రంగాకిరణ్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎడ్లపల్లి శ్రీనివాసరావు, ఆకుల నాగేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు, లక్ష్మణ్ అగర్వాల్, రవీందర్, గాంధీ, రమేశ్ పాల్గొన్నారు.

ఆత్మహత్యపై కేసు నమోదు

బూర్గంపాడు: సారపాక గ్రామ పంచాయతీలోని బసప్పక్యాంపునకు చెందిన కట్ట దివ్య (25) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి కొండయ్య ఫిర్యాదు మేరకు మంగళవారం బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దివ్య ఇటీవల తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై హెడ్‌కానిస్టేబుల్ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిపై విచక్షణారహితంగా దాడి

ఇల్లెందు: సహచర విద్యార్థి గాయపడి తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో గమనించిన మిత్రుడు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా తమకు సమాచారం ఇవ్వకుండా ఆస్పత్రికి ఎందుకు వెళ్లారంటూ వైస్ ప్రిన్సిపాల్ విచక్షణారహితంగా కొట్టిన ఘటన ఇల్లెందులోని ఓ ప్రైవేటు కళాశాలలో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థితో పాటు అతడి తండ్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇల్లెందు సంజయ్‌నగర్‌కు చెందిన బోడ సాజన్‌కుమార్ స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 18న అతడి మిత్రుడు కళాశాలలోనే కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సాజన్‌కుమార్ అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అయితే కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వకుండా వెళ్లారంటూ.. తమ కుమారుడు సాజన్‌కుమార్‌ను వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు విచక్షణారహితంగా కొట్టాడని విద్యార్థి తండ్రి వీరూనాయక్ ఆరోపించారు. ఇందులో తన కుమారుడు చేసిన నేరమేంటని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబును వివరణ కోరగా.. ఇద్దరు విద్యార్థులు ఘర్షణ పడగా ఒకరికి గాయమైతే సమాచారం ఇవ్వకుండా హాస్పిటల్‌కు తరలించారని, దీనిపై ప్రశ్నిస్తే సాజన్‌కుమార్ తప్పుడు సమాచారం ఇచ్చాడని తెలిపారు. అందుకే వైస్ ప్రిన్సిపాల్ మందలించాడని తెలిపారు.

నా భర్తను మానసికంగా హింసిస్తున్నారు..

● 7వ వార్డు కౌన్సిలర్ భర్తపై చైర్మన్ సతీమణి ఫిర్యాదు


సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేస్తున్న బేబీభార్గవి

ఇల్లెందు: సోషల్ మీడియాలో తన భర్తపై దుష్ప్రచారం చేస్తూ మానసికంగా హింసిస్తున్న 7వ వార్డు కౌన్సిలర్ భర్త రవితేజపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సతీమణి బేబీభార్గవి కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె సీఐ టి.కరుణాకర్‌కు ఫిర్యాదు చేశాక మాట్లాడారు. ఓ వాట్సాప్ గ్రూపులో బీఆర్ఎస్ నేత రవితేజ.. మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరావుపై కొన్ని పోస్టులు పెట్టారని తెలిపింది. అందులో అనుచిత వ్యాఖ్యలు, నిరాధార ఆరోపణలు చేశాడని వెల్లడించింది. గతంలోనూ పలుదఫాలు ఇలా పోస్టు చేశాడని, ఆ గ్రూపు అడ్మిన్‌కు సమాచారం ఇచ్చామని, అయినా పదే పదే మానసికంగా ఇబ్బందికి గురయ్యేలా పోస్టులు చేస్తున్నారని చెప్పింది. గొడవలకు దారి తీసే విధంగా రెచ్చగొడుతూ పేరు, ప్రతిష్టలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న రవితేజపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఆమె వెంట బస్తీవాసులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్నారు.

కేసు కొట్టివేస్తూ తీర్పు


భద్రాచలంఅర్బన్: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన పాలకుర్తి సత్యనారాయణ.. తనపై పబ్బుతి కుమార్ అనే వ్యక్తి కర్రతో కొట్టి, గాయపరిచాడని 2013లో భద్రాచలం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో మంగళవారం విచారణకు రాగా సాక్షులు, ఆధారాలను పరిశీలించి భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు నిందితుడిని నిర్దోషిగా పేర్కొంటూ మంగళవారం తీర్పు ఇచ్చారు. నిందితుడి తరపున న్యాయవాది పామరాజు తిరుమల్‌రావు కేసు వాదించారు.

యువతి అదృశ్యం

ఇల్లెందు: మండలంలోని రాజీవ్‌నగర్‌తండాకు చెందిన 19 ఏళ్ల యువతి మెడికల్ షాపునకు వెళ్తాస్తానని చెప్పి బయటకెళ్లి ఇంటికి రాలేదు. దీనిపై యువతి తల్లి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ అబ్దుల్ ఘనీ తెలిపారు.

నిషేధిత కలుపు మందు విక్రయం

● కోర్టు ఆదేశాలున్నాయంటున్న యజమాని
● పంచనామా నిర్వహించిన అధికారులు


దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఇల్లెందు: పట్టణ నడిబొడ్డున ఓ ఎరువులు, పురుగు మందుల దుకాణంలో నిషేధిత కలుపుమందు విక్రయం సాగుతోంది. సమాచారం అందుకున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని దుకాణంలో సోదాలు చేశారు. అయితే తనకు కోర్టు ఆర్డర్ ఉందని ఆ షాపు యజమాని పేర్కొనటంతో అక్కడి సరుకు నిలువలను రికార్డు చేసుకుని పంచనామా నిర్వహించారు. కోర్టు ఆర్డర్ పరిశీలించిన పిమ్మట తగు చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. సబ్ డివిజన్ వ్యవసాయశాఖ అధికారి (ఏడీఏ) వాసవీరాణి కథనం ప్రకారం.. పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లోని 'న్యూ ఆదిత్య సాయి' ఎరువులు, పురుగుమందుల దుకాణంలో గ్లైకోసెట్ కలుపుమందు 500 లీటర్లు నిలువ ఉంది. నాలుగేళ్ల కిందట ఈ మందును నిషేధించారు. ఆ మందును ఇక్కడి షాపునకు ఓ కంపెనీ సరఫరా చేసింది. షాపు యజమాని ఆ కంపెనీ ఇచ్చిన పత్రాలతో విక్రయిస్తున్నారు. నిషేధిత మందులు విక్రయిస్తున్న సమాచారం అందటంతో సోదా చేశామని ఆమె తెలిపారు. షాపు యజమానితో పాటు కంపెనీ ప్రతినిధులు వద్ద ఉన్న కోర్టు ఆర్డర్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విక్రయాలకు అనుమతి లేదని, ఆర్డర్‌లో ఏముందో తేలితే తగు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ సోదాల్లో ఏడీఏ కార్యాలయం టెక్నికల్ ఏడీఏ లాల్‌చంద్, ఏఓ దీపక్, ఏఈఓ సందీప్ తదితరులు ఉన్నారు.

సమరయోధులపై ఛాయాచిత్ర ప్రదర్శన


రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఆగస్టు 30 వరకు మేరా మిట్టీ.. మేరా దేశ్ (నా మట్టి – నా దేశం) పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ప్రముఖ తెలుగు స్వాతంత్ర్య సమరయోధులపై ఛాయాచిత్ర ప్రదర్శన (ఫొటో ఎగ్జిబిషన్)లు ఏర్పాటు చేస్తోంది. బుధవారం నుంచి మూడు రోజుల పాటు కొత్తగూడెం రైల్వేస్టేషన్ (భద్రాచలంరోడ్) ఆవరణలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను బుధవారం ఉదయం 10 గంటలకు అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు, కొత్తగూడెం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తదితరులు ప్రారంభిస్తారు. జిల్లావాసులు అధికసంఖ్యలో తిలకించాలని క్షేత్ర ప్రచార అధికారి కోటేశ్వర్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

‘మార్గదర్శి’లో చేరాం.. మోసపోయాం!

▶ మొదటి పేజీ తరువాయి


మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే మూడు కేసుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై సీఐడీ కేసులను నమోదు చేసి బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసింది. మరోవైపు రాష్ట్రంలో నలుమూలల నుంచి మార్గదర్శి చందాదారులు పెద్ద ఎత్తున సీఐడీకి ఫిర్యాదులు చేస్తున్నారు. ఒక్కో చందాదారుడిది ఒక్కో వ్యథ!

మూడు రోజుల్లో 300కిపైగా ఫిర్యాదులు

మోసపోయిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు ఫిర్యాదు చేసేందుకు సీఐడీ విభాగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. చందాదారులు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా వాట్సాప్ నంబరు (9493174065) అందుబాటులోకి తెచ్చింది. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మార్గదర్శి చందాదారులు పెద్ద సంఖ్యలో సీఐడీకి ఫిర్యాదు చేస్తున్నారు. వాట్సాప్ నంబర్ అందుబాటులోకి రాక ముందు సీఐడీకి దాదాపు వందకుపైగా ఫిర్యాదులు రాగా ఇప్పుడు మూడు రోజుల్లోనే మూడు వందల మందికి పైగా చందాదారులు ఫిర్యాదు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. చందాదారులు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తుండటంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాల చిట్టా అంతకంతకూ పెరుగుతోంది.

చందాదారుల సొమ్ము సొంతానికి... మార్గదర్శి దివాళా అంచుకు

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ రామోజీరావు పాల్పడిన ఆర్థిక అక్రమాలతో చందాదారులు నిండా మోసపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్మును రామోజీరావు నిబంధనలకు విరుద్ధంగా తమ సొంత వ్యాపార సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజస్‌లలో పెట్టుబడిగా పెట్టారు. మరికొన్ని నిధులను మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా తరలించేశారు. దాదాపు 2 వేలకుపైగా ఉన్న చిట్టీ గ్రూపుల చందాదారులు చెల్లించే చందా మొత్తంలో కొంత మొత్తాన్ని అటూ ఇటూ రొటేషన్ చేస్తూ దశాబ్దాలుగా మోసం చేస్తూ వచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలు బయటపడటంతో 2022 నవంబరు నుంచి కొత్త చిట్టీలు నిలిచిపోయాయి. మరోవైపు భారీగా చందాదారుల సొమ్మును రామోజీ తమ పేరిట స్థిర, చరాస్తులుగా మార్చేశారు. దీంతో ప్రస్తుతం చిట్టీ గ్రూపుల్లో ఉన్న దాదాపు 50 వేల మంది చందాదారులకు ప్రైజ్‌మనీని చెల్లించలేక మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతులెత్తేసింది. రాష్ట్రంలోని 37 బ్రాంచీల పరిధిలో దాదాపు 1,300 మంది చందాదారులకు 9 నెలలుగా ప్రైజ్ మనీ చెల్లించడం లేదని సమాచారం. గత 9 నెలల్లో రూ.1,620 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయని సీఐడీ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. మరోవైపు రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్ల మొత్తాన్ని కూడా కాలపరిమితి ముగిసినా చెల్లించడం లేదు. వెరసి దాదాపు రూ.2 వేల కోట్ల వరకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బకాయి పడిందని సీఐడీ అధికారుల సోదాల్లో వెల్లడైనట్లు సమాచారం.



సీఐడీ సత్వర స్పందన

చందాదారుల ఫిర్యాదుపై సీఐడీ విభాగం సత్వరం స్పందిస్తోంది. ఫిర్యాదులో వాస్తవాలు ఉన్నాయని నిర్ధారణ కాగానే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతోంది. ఇప్పటికే మూడు కేసుల్లో మార్గదర్శి బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసింది. ‘ఘోస్ట్’ చందాదారుడి పేరిట భారీ అక్రమ దందాకు పాల్పడిన కేసులో చీరాల మార్గదర్శి బ్రాంచి మేనేజర్‌కు న్యాయస్థానం రిమాండ్ విధించింది.

సీఐడీకి మార్గదర్శి చందాదారుల ఫిర్యాదుల్లో కొన్ని

- విజయనగరంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుడు ఒకరు మొత్తం రూ.6 లక్షలు విలువైన నాలుగు చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన చిట్టీ పాట పాడి రెండు ఎల్ఐసీ బాండ్లను ష్యూరిటీగా సమర్పించారు. రూ.5 లక్షలు, రూ.2 లక్షలు విలువైన రెండు బాండ్లను ష్యూరిటీగా ఇచ్చారు. ఆ చిట్టీ గ్రూపుల కాలపరిమితి ముగిసి నెలలు గడుస్తున్నా ఆయనకు ఎల్ఐసీ బాండ్లను తిరిగి ఇవ్వడంలేదు. దీనిపై సంబంధిత బ్రాంచి మేనేజర్‌ను ఎన్నిసార్లు కలిసినా అరణ్య రోదనగానే మారింది.
- విశాఖపట్నంలో ఒక చందాదారుడు రూ.40 లక్షల చిట్టీ గ్రూపులో సభ్యుడిగా చేరారు. 20 నెలలు వాయిదాలు చెల్లించిన తరువాత రూ.8 లక్షల నష్టానికి అంటే రూ.32 లక్షలకు చిట్టీ పాడారు. కానీ ఏడాదిన్నర అవుతున్నా ఇంత వరకు ఆయనకు చిట్టీపాట మొత్తం చెల్లించడం లేదు. దీనిపై బ్రాంచి మేనేజర్ సరైన సమాధానం చెప్పడం లేదు. ఎందుకంటే ఆ చిట్టీగ్రూపులో పెద్ద సంఖ్యలో నకిలీ చందాదారులు ఉన్నట్టు తెలిసింది. ఆ వాయిదాల ను మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం చెల్లించడం లేదని చందాదారుడికి తెలిసింది. దీనిపై బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా.. నీకు దిక్కున చోట చెప్పుకో, చిట్టీ మొత్తం ఇవ్వలేమని చెప్పడంతో చందాదారుడు నిర్ఘాంతపోయాడు.
- బాపట్లలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో ఒకరు సభ్యుడిగా చేరారు. కొన్నినెలలు పాటు రూ.40 వేలు వాయిదాలు చెల్లించిన తరువాత ఆయన గ్రూప్ నుంచి వైదొలిగారు. ఆయన స్థానంలో మరొకరిని చందాదారుడిగా చేర్చారు. ప్రత్యామ్నాయ చందాదారుడిని చేర్చుకున్న తరువాత వైదొలగిన చందాదారునికి అప్పటికే చెల్లించిన వాయిదాల మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. కానీ ఆ మొత్తం వెనక్కి ఇవ్వడం లేదు. దీనిపై బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా చందాదారుడే తిరిగి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు రూ.25 వేలు చెల్లించాలని దబాయిస్తున్నారు.
- వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఒకరు నాలుగు చిట్ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన చందా వాయిదా చెల్లించడం ఒక్క రోజు ఆలస్యమైనా రోజుకు రూ.500 చొప్పున జరిమానా వసూలు చేశారు. ఆ చందాదారుడు ఓ చిట్టీ గ్రూపులో పాట పాడి మూడు నెలలు దాటినా ప్రైజ్‌మనీ ఇవ్వడం లేదు. నిబంధనల మేరకు ష్యూరిటీలు సమర్పించినా ఆమోదించడం లేదు. దీనిపై సంబంధిత బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా కంపెనీలో ప్రస్తుతం డబ్బులు లేవని అనధికారికంగా చెప్పడంతో చందాదారుడు నిర్ఘాంతపోయారు.
- విశాఖలో మరో చందాదారుడు రూ.5 లక్షలు చిట్ గ్రూపులో చేరి 38 నెలలు సక్రమంగా వాయిదాలు చెల్లించారు. తన కుమారుడి చదువు కోసం చిట్టీ పాడేందుకు వెళ్లగా ఆయన పాడేసి డబ్బులు తీసేసుకున్నట్టు రికార్డుల్లో కనిపించింది. ఆయన పేరుతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యమే పాట పాడేసి డబ్బులు తీసేసుకున్నట్లు తెలిసింది.

అదో విష వలయం.!

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ చందాదారులను పక్కా పన్నాగంతో అష్టదిగ్బంధనం చేస్తోంది. వారిని శాశ్వత రుణగ్రహీతలుగా మార్చేస్తూ వారి సంపాదననే కాకుండా ఆస్తులను కూడా కాజేస్తోంది. కొందరు చందాదారులను అనధికారికంగా పలు చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేరుస్తోంది. ఆ విషవలయం నుంచి తప్పించుకోవడం చందాదారుల తరం కావడం లేదు. ఓ బాధితుడు సీఐడీకి ఫిర్యాదు చేయడంతో మార్గదర్శి అక్రమాల బాగోతం బయటపడింది.
- ఓ చందాదారుడు మొత్తం రూ.4.72 కోట్ల విలువైన చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన రూ.3.33 కోట్ల విలువకు చిట్టీ పాటలు పాడారు. అంటే ఆయనకు రూ.3.33 కోట్లు చిట్టీ పాటల మొత్తం (ప్రైజ్‌మనీ)గా రావాలి. కానీ ఆయనకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతిలో పెట్టింది ఎంతో తెలుసా?
- కేవలం రూ.23లక్షలు. నివ్వెరపోయినచ ఆయన ఇదేమిటని ప్రశ్నిస్తే.. ఆ చందాదారుడికి తెలియకుండా ఆయన్ను ఎందరో చందాదారులకు ష్యూరిటీదారుడిగా నమోదు చేసేశారు. గతంలో ఆయనతో ఖాళీ కాగితాలపై తీసుకున్న సంతకాలతోపాటు మరికొన్ని సంతకాలను ఫోర్జరీ చేసి ఇరికించారు.
- ఆయన 65 చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా చేరితే మార్గదర్శి రికార్డుల్లో మాత్రం 90 గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నట్లు నమోదు చేశారు. అంటే ఆయన సభ్యుడిగా చేరని 25 చిట్టీ గ్రూపులకు కూడా బకాయి ఉన్నట్టుగా చూపిస్తూ ప్రైజ్‌మనీలో కోత విధించారు. దీనిపై ఆ చందాదారుడు సీఐడీకి ఫిర్యాదు చేశారు.

ఇప్పటికే నమోదైన 3 కేసులివీ...

- సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యానికి తెలియకుండా ఆయన్ను చీరాలలో చందాదారుడిగా చేర్చారు. బుక్ అడ్జస్ట్‌మెంట్ల ద్వారా ఆయన చందా చెల్లించినట్టు కనికట్టు చేశారు. ఆయన పేరిట ప్రతి నెల డివిడెండ్‌తోపాటు ఒక నెల ప్రైజ్‌మనీ మొత్తాన్ని కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఖాతాలో వేసుకుంది. అంటే ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే డివిడెండ్లు, ప్రైజ్‌మనీ కొల్లగొట్టి ఇతర చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించింది. తమ ఆధార్ కార్డును దుర్వినియోగంచేయడంతోపాటు తమకు తెలియకుండా చందాదారుడిగా చేర్చడంపై బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు చీరాల పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం మార్గదర్శి చీరాల శాఖ మేనేజర్ సురేంద్రను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.
- అనకాపల్లికి చెందిన బి.వెంకటేశ్వరరావు నెలకు రూ.10 వేలు చొప్పున చందా చెల్లిస్తూ చిట్టీ గ్రూపులో చేరారు. 50 నెలల చందాలు చెల్లించిన తరువాత రూ.4,61,989కు చిట్టీ పాట పాడారు. ఆయన ఎన్నిసార్లు చిట్‌ఫండ్స్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. ఎట్టకేలకు ఆయనకు రూ.20 మాత్రమే వస్తుందని చెప్పారు. మిగిలిన మొత్తాన్ని ఆయన ష్యూరిటీ ఇచ్చిన చిట్టీల్లో సర్దుబాటు చేసినట్టు చూపారు. అసలు తాను ఎవరికీ ష్యూరిటీ ఇవ్వలేదని ఆయన మొత్తుకున్నా బ్రాంచి మేనేజర్ వినిపించుకోలేదు. ఆయన సంతకాలు ఫోర్జరీ చేసిన పత్రాలను చూపించి బెదిరించారు. ఆ కాపీలు ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.
- కోరుకొండ విజయ్‌కుమార్ అనే చందాదారుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రాజమహేంద్రవరం బ్రాంచిలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో చేరారు. కొన్ని వాయిదాలు చెల్లించిన తరువాత 2020 జూన్‌లో రూ.3 లక్షలకు చిట్టీ పాట పాడారు. కానీ ఆయనకు ప్రైజ్‌మనీ ఇచ్చేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్ నిరాకరించారు. విజయ్‌కుమార్ తన స్నేహితుడు మల్లికార్జునరావుకు 2019లో ష్యూరిటీ ఇచ్చారని, ఆ స్నేహితుడు వాయిదాలు చెల్లించడం లేదు కాబట్టి ప్రైజ్‌మనీ ఇవ్వలేమని చెప్పారు. నిజానికి మల్లికార్జునరావు చిట్టీ గడువు అప్పటికే తీరిపోయింది. తనను మార్గదర్శి యాజమాన్యం మోసం చేసిందని విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

లోకేశ్‌తో నాకు ప్రాణహాని

ఇదే నా మరణ వాంగ్మూలం

- నాపై పరువు నష్టం దావా అందుకే వేశారు
- మంగళగిరి కోర్టుకు వెళ్లి వచ్చే సమయంలో హతమార్చాలని కుట్ర పన్నారు
- నేను చనిపోతే దానికి కారణం లోకేశే
- కంతేరులో హెరిటేజ్ పేరిట భూములు కొన్నది వాస్తవం కాదా?
- లోకేశ్‌కు తెలీకుండానే ఆయన తల్లి, భార్య భూములు కొన్నారా?
- వాళ్ల కుటుంబ సభ్యుల ఆస్తులతో లోకేశ్‌కు సంబంధం లేదా?
- నిత్యం బూతులు మాట్లాడే లోకేశ్‌పై నేను పరువునష్టం దావా వేస్తే 20 ఏళ్లు జైల్లో ఉండాలి
- ఏపీలోని నా ఆస్తి మొత్తం పేదలకు ఇచ్చేస్తా.. రాజధాని రైతులు స్టే వెనక్కి తీసుకోవాలి
- మీడియాతో పోసాని కృష్ణమురళి

సాక్షి, అమరావతి : టీడీపీ నేత నారా లోకేశ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి తీవ్ర ఆరోపణ చేశారు. అందుకోసమే తనపై పురునష్టం దావా వేశారని.. ఈ కేసులో మంగళగిరి కోర్టుకు వెళ్లివచ్చే సమయంలో తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను చనిపోతే దానికి లోకేశే కారణమని ఇదే తన మరణ వాంగ్మూలంగా భావించాలన్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తానని మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. పోసాని ఇంకా ఏమన్నారంటే..

గతంలో లోకేశ్ నన్ను పార్టీలోకి రావాలని కోరారు. నేను నిబద్ధత కలిగిన నాయకుల వెంటే ఉంటానంటూ తిరస్కరించా. పైగా వారి అక్రమాలను ఎప్పటికప్పుడు నిలదీస్తున్నాను. అందుకే వాళ్లు నాపై కక్షగట్టారు. నేను ఎప్పుడో కంతేరులో లోకేశ్ భూములు కొన్నారని చెప్పానట. దానిని పట్టుకుని నాపై రూ.4 కోట్లకు పరువు నష్టం దావా వేశారు. అంతేకాదు.. రెండేళ్లు జైలుశిక్ష కూడా వేయిస్తారట. కంతేరులో హెరిటేజ్ పేరిట భూములు కొన్నది వాస్తవం కాదా? లోకేశ్ భూములు దోచేశారు.. కబ్జా చేశారనలేదే నేను. కొన్నారనే చెప్పాను. మీ కుటుంబ సభ్యులు కొంటే నీకు సంబంధం లేదా? మీ తల్లి, భార్య పేరు మీద ఉన్న ఆస్తులు ఎవరికి లోకేశ్?

పవన్ వ్యాఖ్యలు మర్చిపోయారా?

అల్‌ఖైదా అంటే లాడెన్ గుర్తొచ్చినట్లు.. హెరిటేజ్ అంటేనే చంద్రబాబు గుర్తొస్తారు. నిత్యం బూతులతో జపంచేసే లోకేశ్‌పై తాను పురువు నష్టం కేసువేస్తే 20 ఏళ్లు జైలులో ఉండాల్సి ఉంటుంది. గతంలో దళితులు, ముఖ్యమంత్రి జగన్‌ను, పోలీసు అధికారులను దుర్భాషలాడిన లోకేశ్ వీడియోలను, విదేశీ మహిళలతో అర్ధనగ్నంగా దిగిన ఫొటోలను మీడియా ఎదుట పోసాని ప్రదర్శించారు. గతంలోనే లోకేశ్ బతుకును పవన్ రోడ్డున పడేశారు. ప్రతి నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల కుంభకోణం చేశారంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు మర్చిపోయారా? సమాజంలో బూతులు మాట్లాడేవాళ్ల కంటే బూతుపనులు చేసే లోకేశ్ లాంటి వ్యక్తులతోనే ఎక్కువ ప్రమాదం.

ఏపీలోని నా ఆస్తి మొత్తం ఇచ్చేస్తా..

చంద్రబాబుకు వ్యవస్థలను మేనేజ్ చేసే సత్తా ఉంది. అందుకే 16 కేసుల్లో స్టేలు తెచ్చుకున్నాడు. పుంగనూరులో పోలీసులపైనే దాడులు చేయించారు. నేనెంత బక్కవాడిని. నాలుగు పోట్లు వేస్తే నేను అవుట్. లోకేశ్ ఏంచేసినా కాపాడటానికి చంద్రబాబు ఉన్నారు. లోకేశ్ కంటే నాకు విశ్వసనీయత ఎక్కువ ఉంది.. అంతేగాని, అమ్ముడుపోయే వాడిని కాదు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా గెలవొచ్చు.. కమ్మ కులమే గెలవాలనుకోవడం దుర్మార్గం. ఎవరు గెలిచినా ప్రజలకు ఎంత మంచి చేస్తున్నారో చూడాలే తప్ప కులం దురాభిమానంలో పడకూడదు. రాజధానిలో ఐదు శాతం భూములు పేదలకు ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ చంద్రబాబు దానిని తుంగలో తొక్కారు. కొంతమందికి కులం పిచ్చి ఎక్కించి నన్ను తిట్టిస్తున్నారు. రాజధానిలో పేదలకు సెంటు భూమి ఇవ్వడంలో తప్పేంటని నేను ప్రశ్నిస్తే.. ఓ కమ్మ రైతు పెదకాకానిలో నాకున్న 16 ఎకరాలు ఇవ్వమంటూ బూతులు తిట్టాడు. అసలు నాకు అక్కడ భూమేలేదు. ఐదారు ఇళ్ల స్థలాలు, రెండు పెంకుటిళ్లు ఉన్నాయి. జగ్గయ్యపేట దగ్గర 30 ఏళ్ల కింద కొన్న కొంత భూమి ఉంది. మా నాన్న డబ్బులేక ఆత్మహత్య చేసుకున్నారు. నేను సినిమాల్లోకి వెళ్లిన తర్వాతే సంపాదించుకున్నా. అయినా, ఏపీలోని నా ఆస్తి మొత్తం పేద ప్రజలకు ఇచ్చేస్తా.. రాజధాని రైతులకు మానవత్వం ఉంటే పేదలకు సెంటు భూమి ఇవ్వండి. కోర్టు కేసులను వెనక్కితీసుకోండి.



రాజధాని భూముల్లో త్యాగాల్లేవు..

రాజధాని భూముల్లో వ్యాపారం తప్ప త్యాగాల్లేవు. రాజధాని ప్రకటన కంటే ఆరు నెలల ముందే రామోజీరావు, చంద్రబాబు ఫిల్మ్‌సిటీలో కూర్చుని భూముల కొనుగోలుపై చర్చించుకున్నారు. వైఎస్సార్ రూ.11వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తే అందులో తమ కులం వాళ్లు కూడా హాయిగా లబ్ధిపొందారు.. ఇప్పుడు పేదలకు తమ భూములు ఇవ్వొద్దని వారు చెప్పడం సిగ్గుచేటు.

జిల్లా వార్తలు


నిత్యాన్నదానానికి రూ.50వేల విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఖమ్మానికి చెందిన భక్తులు మంగళవారం విరాళం అందజేశారు. ఖమ్మం వీడీవోస్ కాలనీకి చెందిన కొర్లకుంట కిశోర్‌-ఉమ దంపతులు రూ.50,116 ఆలయ అధికారులకు వితరణగా అందజేయగా వారు రశీదు అందజేసి పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబ, ఉద్యోగులు పాల్గొన్నారు.

10 నుంచి జన సేవాదళ్ శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న భాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ అనుబంధ జనసేవాదళ్ జాతీయస్థాయి శిక్షణా కార్యక్రమం సెప్టెంబర్ 10 నుంచి 18 వరకు ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జన సేవాదళ్ శిక్షణా శిబిరానికి దేశంలోని 20 రాష్ట్రాల నుంచి యువకులు హాజరవుతారని తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు జనసేవాదళ్‌కు సంబంధించిన శిక్షణను 10 రోజుల పాటు నిర్వహించనున్నామని చెప్పారు. సమావేశంలో సీపీఐ నాయకులు మహ్మద్ మౌలానా, సిద్ధినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

24న విద్యుత్ కార్మికుల ధర్నా

ఖమ్మంవ్యవసాయం: సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌మ్యాన్డ్, పీస్ రేట్ కార్మికులు, జేఎల్ఎంల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో చేయనున్న ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నిర్వీర్యమవుతున్న విద్యావ్యవస్థ

- పాలకుల విధానాలతోనే ఈ పరిస్థితి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరుతో విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో డీఈఓలు లేక... మండలాల్లో ఎంఈఓలను నియమించకపోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడిందని తెలిపారు. కొత్తగూడెంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని, అప్పటి వరకు విద్యావలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ట్రెజరీల్లో ఆమోదం పొంది ఈ- కుబేర్‌లో పెండింగ్ బిల్లులన్నీ తక్షణమే విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీని నియమించడమే కాక నివేదిక వచ్చే వరకు మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. అంతేకాక సీపీఎస్ రద్దు చేసి 2004 సెప్టెంబర్‌కు ముందే విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఎస్టీటీ ఇసంపల్లి కొండయ్య సంస్మరణ సభలో పాల్గొన్న నర్సిరెడ్డి.. ఆయన కుటుంబానికి టీఎస్ యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి నుండి మంజూరైన రూ.6లక్షల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావా రవి, జిల్లా అధ్యక్షుడు బి.కిషోర్‌సింగ్‌తో పాటు రాజశేఖర రెడ్డి, లక్ష్మారెడ్డి, బి.రాజు, ఎస్.కృష్ణ, వి.వరలక్ష్మి, ఎస్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం అర్బన్ : సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కళాశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

వైరా: వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వీరభద్రం అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అధ్యాపకులు, విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి తన నిధుల నుంచి రూ.23 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో పనులు త్వరగా మొదలుపెట్టాలని సూచించిన ఆయన మరిన్ని నిధుల కేటాయింపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాగా, కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెంచి మెరుగైన విద్యనందించాలని అధ్యాపకులకు సూచించారు. అధ్యాపకులు జి.అనిల్, పి.శ్రీనివాసరావు, ఉమాసుందరి, జి.శ్రీనివాసరావు, కె.సురేష్, శ్రీకాంత్, రోషన్, వెంకటముత్యం, ఈశ్వరీరావు, మధు, కవిత, సుధాకర్, బాపూరావు పాల్గొన్నారు.

రైతాంగానికి అండగా నిలుస్తాం

నాబార్డు సీజీఎం సుశీల

తిరుమలాయపాలెం: దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న రైతులకు అన్నిరకాలుగా అండగా నిలుస్తున్నామని నాబార్డ్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) చింతాల సుశీల తెలిపారు. తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో రైతు ఉత్పత్తిదారుల సంఘం గోదాం, ఉత్పత్తిదారుల కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ప్రైవేట్ గోదాంలు, ఎరువుల షాపులను నియంత్రించేలా రైతు ఉత్పత్తి సంఘాలు పనిచేస్తేనే అన్నదాతలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సంఘాల ద్వారా అమ్మకాలు, కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా ఏజీఎం సుశీల్‌కుమార్, ఏఓ సీతారాంరెడ్డి, ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ మోటపోతుల శ్రీనివాస్‌తో పాటు హన్మంతరావు, లలిత, నాగమణి, సామా వెంకటరెడ్డి, రామయ్య, కొత్తపల్లి వెంకటరెడ్డి, మూడ్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట: ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలిస్తున్న సీజీఎం సుశీల, అధికారులు

దమ్మపేట మండలంలో పర్యటన

దమ్మపేట: నాబార్డ్ సీజీఎం సుశీల దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ క్షేత్రాలు, అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ, నర్సరీని పరిశీలించారు. అనంతరం సీజీఎం మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడి దిశగా ఆలోచించి పామాయిల్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. నాబార్డ్ అధికారులు శ్వేతాసింగ్, సుజిత్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, ఆయిల్ ఫెడ్ మేనేజర్లు బాలకృష్ణ, కల్యాణ్, హెచ్ఓ సందీప్, విజయ్‌కుమార్, సతీశ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయడమే లక్ష్యం

వేంసూరు: రైతులకు మేలు చేయడమే నాబార్డు లక్ష్యమని సీజీఎం సుశీల తెలిపారు. వేంసూరులో పర్యటించిన ఆమె సహకార సంఘం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సొసైటీ అధ్యక్షుడు తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, డీసీసీబీ సీఈఓ వీరబాబు, డైరెక్టర్లు గొర్ల సంజీవరెడ్డి, చల్లగుండ్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల పీడీ కుర్సం నాగేంద్రమ్మ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. సికింద్రాబాద్‌లో ఇటీవల ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాగేంద్రమ్మ 100మీటర్ల పరుగుపందెంలో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచి ఛండీగఢ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ఉద్యోగులు మంగళవారం సన్మానించారు. హెచ్‌ఎం తోలెం వెంకటేశ్వర్లు, వార్డెన్ సౌజన్య, ఉపాధ్యాయులు రమణ, కాంతమ్మ, రజినీ, గోపాల్‌రావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



పీడీ నాగేంద్రమ్మను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉద్యోగులు

నెడాక్ వర్క్‌షాప్‌లో డీసీసీబీ చైర్మన్



వర్క్‌షాప్‌లో పాల్గొంటున్న బృందంలో డీసీసీబీ చైర్మన్ నాగభూషణం

బ్యాంకాక్‌లో నాలుగు రోజుల పాటు శిక్షణ

ఖమ్మంవ్యవసాయం: అంతర్జాతీయ కోఆపరేటివ్ బ్యాంక్ అసోసియేషన్ ఆధ్వర్యాన థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో ‘వ్యవసాయ సహకార సంఘాల సుస్థిర అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి సాధించడం’అంశంపై నెడాక్ (నెట్‌వర్క్ ఫర్ ద డెవలప్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ ఇన్ ఆసియా, పసిఫిక్) వర్క్‌షాపు నిర్వహిస్తోంది. ఈ వర్క్‌షాప్ 25వ తేదీ వరకు కొనసాగనుండగా, ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కూరాకుల నాగభూషణం పాల్గొంటున్నారు. బ్యాంకాక్‌లోని నెడాక్ ప్రధాన కార్యాలయం ఆసియా - పసిఫిక్ గ్రామీణ, వ్యవసాయ క్రెడిట్ అసోసియేషన్ సహకారంతో సుస్థిరమైన, పర్యావరణ స్పృహతో కూడిన వ్యవసాయ పద్ధతులను రూపొందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. నిపుణుల నేతృత్వాన ప్రదర్శనలు, పలుఅంశాలపై ప్రసంగాలు ఉంటాయి. వర్క్‌షాప్‌లో టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఐసీబీఏ బీమా చైర్మన్ సుబ్రహ్మణ్యం, నెడాక్ డైరెక్టర్ కృష్ణ, ప్రసన్నకుమార్‌తో పాటు ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌తో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, వరంగల్ డీసీసీబీ చైర్మన్లు పాల్గొంటున్నారు.

హెచ్‌ఎంల పర్యవేక్షణతో విద్యాప్రగతి

కొత్తగూడెంఅర్బన్: ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల్లో బోధన, అభ్యసన ప్రక్రియలను నిత్యం పర్యవేక్షించడం ద్వారా విద్యార్థుల్లో ప్రగతి సాధ్యమవుతుందని, ఉన్నతి, లక్ష్య కార్యక్రమ ఉద్దేశాలు నెరవేరతాయని రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం డైరెక్టర్ ఎస్. శ్రీనివాసాచారి తెలిపారు. కొత్తగూడెంలో ప్రధానోపాధ్యాయులకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆరు నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించడానికి బోధనా అభ్యసనను మార్పు చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉపాధ్యాయులకు సలహాలు ఇవ్వడం ద్వారా పిల్లల విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. కోర్స్ డైరెక్టర్ ఎ.నాగరాజశేఖర్, రిసోర్స్ పర్సన్లు రమ, శ్రీనివాసరావు, పద్మలత, శంకర్, ఏసీజీఈ మాధవరావు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసాచారి

రైతులు జాగ్రత్తలు పాటించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని కొత్తగూడెం కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. మూడు రోజుల పాటు తేలిక నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. పత్తిలో రసం పీల్చే పురుగు ఉధృతి ఉన్నందున దీని నివారణకు లీటర్ నీటిలో 0.3 గ్రాముల ఫ్లోనికామిడ్ లేదా 0.25 మి.లీ. ఇమిడాక్లోప్రేడ్ కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. అలాగే, వరిలో పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులను ఎట్టి పరిస్థితుల్లో వేయొద్దని, నాటు వేసిన 25 రోజుల తర్వాత పైపాటుగా ఎకరానికి 45 కిలోల యూరియా (నత్రజని)ను బురద పదునులో మాత్రమే వెదజల్లి 48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలని తెలిపారు. వరినాట్లు పూర్తయ్యాక 15 నుంచి 21 రోజుల దశలో ఉన్న పంటలో గడ్డి సమస్య అధికంగా ఉంటుందని, కలుపు నివారణకు లీటర్ నీటిలో 4 మి.లీ బిస్‌పైరిబాక్ సోడియం మందు కలిపి కలుపు మొక్కలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. ఇక వరి నాట్లు సకాలంలో వేయని రైతులు ముదురు నారు నాటాల్సి వస్తే నారు చివర్లు తుంచి కుదురుకు మొక్కల సంఖ్య 6-8 పెంచి, సిఫారసు చేసిన నత్రజనిని 25 శాతం పెంచి దమ్ములో 70 శాతం, మిగిలిన 30 శాతం అంకురం దశలో వేయాలని శాస్త్రవేత్తలు తెలిపారు.